సాక్షి నంద్యాల
మంగళవారం । 26 । నవంబర్ । 2024



ఉల్లి క్వింటం రూ. 4,869

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం ఉల్లి క్వింటానికి గరిష్ట ధర రూ.4,869 లభించింది. 209 మంది రైతులు 4,028 క్వింటాళ్ల ఉల్లి తెచ్చారు.



'స్మార్ట్'గా విద్యుత్ ఉచ్చు

జిల్లాలో గుట్టు చప్పుడు కాకుండా స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ సాగుతోంది. రీచార్జ్ చేసుకుంటేనే విద్యుత్ సరఫరా అయ్యే ఈ మీటర్లను పేదలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1,633
ప్రస్తుతం	: 1,630.26
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 94.965
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 3,359
అవుట్ ఫ్లో	: 7,039

న్యూస్‌రీల్

ఎయిడ్స్‌పై అవగాహన పెంచండి



పోస్టర్లు విడుదల చేస్తున్న జేసీ, అధికారులు

నంద్యాల: ఎయిడ్స్ వ్యాధికి మందు లేదని, నివారణ ఒక్కటే మార్గమని దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ పేర్కొన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా నిర్వహించాల్సిన అవగాహన కార్యక్రమాలపై సోమవారం కలెక్టరేట్‌లో జేసీ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ డిసెంబర్ 1న ఎయిడ్స్ దినోత్సవం ఉండటంతో ఈనెల 27వ తేదీ నుంచి 15రోజుల పాటు ఎయిడ్స్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ రామునాయక్, డీఎం అండ్‌హెచ్‌ఓ వెంకటరమణ, అడిషనల్ డీఎం అండ్‌హెచ్‌ఓ శారదాబాయి పాల్గొన్నారు.

నాగార్జున సాగర్‌కు నీరు విడుదల

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైల జలాశయం నుంచి దిగువ నాగార్జునసాగర్‌కు ఆదివారం నుంచి సోమవారం వరకు 35,147 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తెలంగాణలోని భూగర్భ జల విద్యుత్ కేంద్రంలో 15.785 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసిన అనంతరం నీటిని సాగర్‌కు విడుదల చేశారు. శ్రీశైలానికి సుంకేసుల నుంచి కేవలం 1,132 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరింది. ఇక్కడి నుంచి సాగర్‌తో పాటు పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 7,000 క్యూసెక్కులు,హంద్రీనీవా సుజలస్రవంతికి 1,547 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతలకు 1,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం జలాశయంలో 140.6495 టిఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం నీటిమట్టం 869.80 అడుగులకు చేరుకుంది.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం



ఎగువ అహోబిలంలో పారిశుద్ధ్యంపై సూచనలిస్తున్న జిల్లా అటవీ అధికారి కృష్ణమూర్తి

ఆళ్లగడ్డ: అన్ని జీవరాశులు ఆరోగ్యకర మనుగడకు పర్యావరణ పరిరక్షణ ఎంతో అవసరమని జిల్లా అటవీ అధికారి కృష్ణమూర్తి అన్నారు. పర్యావరణం దెబ్బతింటే ఆ ప్రభావం ఎక్కువగా వన్యప్రాణులపై పడుతుందని చెప్పారు. సోమవారం అహోబిలం అడవి ప్రాంతాన్ని ఆయన తనిఖీ చేశారు. ఎగువ అహోబిలంలోని పాతాల గంగ సమీపంలో హోటళ్ల నిర్వాహకులతో మాట్లాడారు. ప్లాస్టిక్ బ్యాగులను వాడరాదన్నారు. దేశానికి పచ్చని హారంగా ఉన్న అటవీ ప్రాంతంలో ఎర్రచందనం, వన్యప్రాణుల పరిరక్షణ ప్రతి ఒక పౌరుడి బాధ్యత అన్నారు. అనంతరం ఎర్రచందనం, వన్యప్రాణుల పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అటవీశాఖ సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఆయన వెంట రుద్రవరం అటవీ రేంజ్ అధికారి శ్రీపతినాయుడు, డీఆర్వో ముర్తుజావలి ఉన్నారు.

వందశాతం ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న డీఈఓ జనార్దన్‌రెడ్డి

నంద్యాల (న్యూటౌన్): పదవ తరగతిలో ఈసారి ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు వందశాతం ఫలితాలు సాధించాలని డీఈఓ జనార్దన్‌రెడ్డి అన్నారు. సోమవారం నంద్యాల పట్టణంలోని ఖలీల్ సిద్దిఖీ ఎయిడెడ్ హైస్కూల్‌ను సందర్శించారు. ప్రార్థన కార్యక్రమంలో డీఈఓ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. జిల్లాలో ఈ ఏడాది మెరుగైన ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. వెనుకబడిన విద్యార్థుల కోసం అదనపు తరగతులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ అస్మోద్దీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు సివిల్ సర్వీసెస్ ఉచిత కోచింగ్ ప్రవేశ పరీక్ష

కర్నూలు (అర్బన్): ఈనెల 27వ తేదీన స్థానిక బీసీ స్టడీ సర్కిల్‌లో ఉదయం 11 గంటలకు సివిల్ సర్వీసెస్ ఉచిత కోచింగ్‌కు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారిణి పి.వెంకటలక్ష్మమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఉదయం 9 గంటల లోపు ఏపీ బీసీ స్టడీ సర్కిల్ పరీక్ష హాలుకు హాజరుకావాలన్నారు. 10.45 గంటల తర్వాత హాజరైన విద్యార్థులను పరీక్ష హాల్‌లోకి అనుమతించడం జరగదన్నారు.

దీపం..దివ్యతేజం!

- పుణ్యక్షేత్రాలు కార్తీక శోభితం
- భక్తులతో కిటకిటలాడిన శ్రీగిరి
- మార్మోగిన శివనామస్మరణ
- కనుల పండువగా లక్షదీపోత్సవం, పుష్కరిణి హారతి



కృష్ణమ్మకు పూజలు చేస్తున్న భక్తులు



పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు



పుష్కరిణికి దశవిధ హారతులు ఇస్తున్న అర్చకుడు



కార్తీక దీప కాంతులతో పుణ్య క్షేత్రాలు దేదీప్యమానంగా వెలుగొందాయి. ఓం నమః శివాయ.. హర..హర..మహాదేవా.. శంభో శంకరా.. అంటూ భక్తుల శివనామస్మరణతో మార్మోగాయి. కార్తీక మాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకుని జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రాలైనా శ్రీశైలం, మహానంది, యాగంటి, కాచింతల భక్తులతో పోటెత్తాయి. శ్రీగిరిలో లక్షదీపోత్సవం, పుష్కరిణి హారతి కనుల పండువగా జరిగింది.



మహానందిలో జలహారతి ఇస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: ఇలకైలాసమైన శ్రీశైలమహాక్షేత్రంలో కార్తీకమాసోత్సవాలు ఆధ్మాత్మికభరితంగా సాగుతున్నాయి. కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో శ్రీగిరికి భక్తులు పోటెత్తారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వేలాదిగా తరలివచ్చారు. వేకువజామునే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి, మల్లన్న దర్శనానికి బారులు తీరారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు ఆలయ ద్వారాలను తెరచి దర్శనాలకు అనుమతించారు. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలు కిక్కిరిశాయి. ఆలయం ముందు భాగంలోని గంగాధర మండపం వద్ద, ఆలయ ఉత్తర(శివ)మాడవీధిలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన దీపారాధనలో పలువురు భక్తులు దీపాలు వెలిగించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.

నేత్రపర్వంగా లక్షదీపోత్సవం, పుష్కరిణిహారతి

కార్తీకమాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకుని శ్రీశైల దేవస్థానం లోక కల్యాణం కోసం పుష్కరిణి వద్ద లక్షదీపోత్సవం, పుష్కరిణి హారతి నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పుష్కరిణి ప్రాంగణమంతా లక్ష దీపాలను ఏర్పాటు చేశారు. భక్తులు భక్తిశ్రద్ధలతో ఆ దీపాలను వెలిగించారు. అలాగే సాయంత్రం శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పుష్కరిణి వద్ద ఆశీనులు చేసి అర్చకులు, వేదపండితులు విశేష పూజాదికాలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లకు, పుష్కరిణికి దశవిధ హారతులను శాస్త్రోక్తంగా ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని భక్తులు కనులారా తిలకించి స్వామి అమ్మవార్లను దర్శించుకొని పరవశించిపోయారు. పూజా కార్యక్రమంలో దేవస్థాన అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

మహానందిలో వైభవంగా జల హారతులు

మహానంది: కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా మహానందిలో రాత్రి గంగాజల హారతులు అత్యంత వైభవంగా జరిగాయి. ఆలయ ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు రవిశంకర్ అవధాని, ఉప ప్రధాన అర్చకులు మూలస్థానం శంకరయ్య శర్మ, ముఖ్య అర్చకులు రాజారత్తయ్య బాబు, రాజమాణిక్య శర్మ, రాఘవ శర్మ ఆధ్వర్యంలో ముందుగా గంగాదేవికి విశేష పూజలు చేసి జలహారతులు ఇచ్చారు. వేలాది మంది భక్తులు తిలకించారు.




మల్లికార్జున,భ్రమరాంబ స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు



శ్రీశైల ఆలయ పుష్కరిణి వద్ద లక్షదీపోత్సవం



కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



యాగంటిక్షేత్రంలో వెంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్తున్న భక్తులు



ఆళ్లగడ్డ శివారులోని కాచింతల క్షేత్రం వద్ద భక్త జన సందడి

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి

- పెండింగ్‌లో 774 ఫిర్యాదులు
- సత్వరం వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి
- పీజీఆర్ఎస్‌లో అధికారులకు జేసీ విష్ణుచరణ్ ఆదేశం

నంద్యాల: ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. వివిధ సమస్యలపై జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి జేసీ అర్జీలను స్వీకరించి మాట్లాడారు. పీజీఆర్ఎస్‌లో ఇంకా 774 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇందులో రెవెన్యూ, సర్వే, పంచాయతీరాజ్, సివిల్ సప్లయ్, పోలీస్ తదితర శాఖలకు సంబంధించినవి అధికంగా ఉన్నాయని చెప్పారు. వీటి పరిష్కారానికి ఆర్డీఓలు, సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సీఎంఓ కార్యాలయ ఫిర్యాదులు సైతం 67 పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు.వీటిని త్వరగా క్లియర్ చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ రాము నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు

పీజీఆర్ఎస్‌కు వచ్చిన వినతుల్లో కొన్ని..

- ఈ నెల 30వ తేదీలోపు ఎన్‌పీసీఐ బ్యాంక్ అకౌంట్ మ్యాపింగ్, జియో ట్యాగింగ్ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని, ఈ ప్రక్రియ పూర్తికి మరికొంత సమయం ఇవ్వాలని వార్డు, గ్రామ హెల్త్ సెక్రెటరీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు జేసీకి విన్నవించారు.
- తనకు బ్యాటరీ ట్రై సైకిల్ మంజూరు చేయాలని ఆత్మకూరు మండలం నల్లకాలువ గ్రామానికి చెందిన దివ్యాంగుడు వెంకటస్వామి జేసీని కోరారు.
- తన తండ్రికి 4.70 ఎకరాలు భూమి ఉందని, ఆయన మరణాంతరం తమ్ముడొక్కడే ఆ భూమిని ఆన్‌లైన్ చేసుకొని పాసుపుస్తకం తెచ్చుకున్నారని, ఈ విషయంలో న్యాయం చేయాలని పాణ్యం మండలం భూపనపాడు గ్రామానికి చెందిన సత్యరాజ్ వినతిపత్రం అందజేశారు.




వినతులు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్

28న విభిన్న ప్రతిభావంతులకు ఆటల పోటీలు

కర్నూలు(అర్బన్): అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల (దివ్యాంగుల) దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 28వ తేదీన స్థానిక అవుట్‌డోర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా స్థాయి ఆటల పోటీలను నిర్వహిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయిస్ ఫాతిమా సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన విభిన్న ప్రతిభావంతులు, బధిరులు, మానసిక దివ్యాంగులు, అంధులు ఈ ఆటల పోటీల్లో పాల్గొని తమ క్రీడా ప్రతిభ చాటాలన్నారు. క్రీడల్లో పాల్గొనే వారు ఆధార్‌కార్డు, వికలత్వ ధ్రువీకరణ పత్రం నకలుతో 28న ఉదయం 8 గంటలకు కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో హాజరు కావాలన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే దివ్యాంగ ఉద్యోగులకు ఓడీ సౌకర్యం ఉందన్నారు. వివరాలకు కార్యాలయ అధికారులను (08518-277864) సంప్రదించాలన్నారు.

ఆర్‌యూ ఇంజినీరింగ్ పరీక్షలు ప్రారంభం



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న వర్సిటీ వీసీ ఎన్‌టీకే నాయక్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ విద్యార్థులకు 3, 7 సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. పరీక్ష కేంద్రాలను వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ సందర్శించి పరిశీలించారు. అనంతరం వర్సిటీ సైన్స్, ఆర్ట్స్ కళాశాలలను సందర్శించారు. తరగతులు జరుగుతున్న తీరును పరిశీలించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు. టైంటేబుల్‌ను అనుసరించి రెగ్యులర్‌గా తరగతులు జరిగేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు సంబంధించి 224 మందికి 223 హాజరు కాగా ఒకరు గైర్హాజరయ్యారని ఆర్‌యూసీఈ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సప్లిమెంటరీ పరీక్షలకు 74 మందికి 74 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. ఏడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు సంబంధించి 167 మందికి 167 మంది, సప్లిమెంటరీ పరీక్షలకు ముగ్గురు విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. వీసీతో పాటు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ విజయకుమార్ నాయుడు ఉన్నారు.

ఏపీజీబీలో మూడు గ్రామీణ బ్యాంకుల విలీనం!

- త్వరలో కార్యరూపం దాల్చే అవకాశం
- కడపలోనే ప్రధాన కార్యాలయం కొనసాగించాలని ఉద్యోగులు డిమాండ్

కర్నూలు(అగ్రికల్చర్): రాష్ట్రంలోని వివిధ గ్రామీణ బ్యాంకులు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో విలీనమవుతున్నాయి. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. రాష్ట్రంలో మొత్తం నాలుగు గ్రామీణ బ్యాంకులు ఉండగా.. ఇందులో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు అతి పెద్ద బ్యాంకుగా ఉంది. మిగతా మూడింటిలో ఆంధ్రప్రగతి గ్రామీణ వికాస్ బ్యాంకు, చైతన్య గోదావరి బ్యాంకు, సప్తగిరి గ్రామీణ బ్యాంకులున్నాయి. ఈ మూడు ఏపీజీబీలో విలీనం కానున్నాయి. ఈ నేపథ్యంలో కడపలో ఉన్న ఏపీజీబీ కార్యాలయాన్నే ప్రధాన కార్యాలయంగా గుర్తించాలని ఆ బ్యాంకు అధికారుల సంఘం డిమాండ్ చేస్తోంది. అన్ని మౌలిక సదుపాయాలు ఉన్నందున కడపలోనే ప్రధాన కార్యాలయాన్ని కొనసాగించాలని ఆసంఘం నాయకులు కోరుతున్నారు. దక్షిణ భారత దేశంలో ఏ గ్రామీణ బ్యాంకుకు లేని విధంగా ఏపీజీబీకి కరెన్సీ చెస్ట్ కూడా ఉందని పేర్కొంటున్నారు. ఈ మేరకు సోమవారం ఏపీజీబీ బ్యాంకు యూనియన్‌ల ప్రతినిధులు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితను కలసి విలీనమవుతున్న గ్రామీణ బ్యాంకుల ప్రధాన కార్యాలయాన్ని కడపలో కొనసాగించే విధంగా చూడాలని కోరారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

బలవంతపు సభ్యత్వం!

- డ్వాక్రా సంఘాల సభ్యులపై తెలుగు తమ్ముళ్ల బెదిరింపుల పర్వం
- టీడీపీ సభ్యత్వం తీసుకోవాల్సిందేనని ఒత్తిడి
- సంక్షేమం అందాలంటే తప్పని సరి అని స్పష్టీకరణ
- జిల్లాలో దాదాపు 31,624 పొదుపు సంఘాలు
- సంతకం పెట్టాల్సిందేనని ఫోన్లు చేసి మరీ ఆదేశాలు



పట్టణంలో టీడీపీ సభ్యత్వ నమోదు పత్రాలు అందజేస్తున్న ఎన్ఎండీ ఫిరోజ్



సమావేశంలో పాల్గొన్న మహిళలు (ఫైల్)

నంద్యాల(అర్బన్): అధికారం కోసం చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో హామీలతో ప్రజలను ఎలా మభ్య పెట్టారో ఇప్పుడు సభ్యత్వ నమోదు కోసం ఆ పార్టీ నేతలు కూడా అడ్డదారులు తొక్కుతున్నారు. పథకాలు అందాలంటే పార్టీలో సభ్యత్వం తీసుకోవాల్సిందేనని ఒత్తిళ్లు చేస్తున్నారు. ఇష్టం ఉన్నా లేకున్నా ఇది తప్పనిసరి అంటూ బెదిరింపులకు దిగుతున్నారు. ప్రధానంగా స్వయం సహాయక సంఘాల మహిళలకు ఫోన్లు చేసి మరీ బలవంతంగా పార్టీ సభ్యత్వం అంటగడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇలా ఒత్తిడి చేసి పార్టీలో చేర్చు కోవడాన్ని పలువురు వ్యతిరేకిస్తున్నారు. జిల్లాలో 31,624 పొదుపు సంఘాల్లో 3,34,604 మంది సభ్యులు ఉన్నారు.

ఇదీ సంగతి...

అలవిగాని హామీలు ఇచ్చి, సార్వత్రిక ఎన్నికల్లో గట్టెక్కిన టీడీపీ తాజాగా సభ్యత్వ నమోదుపై దృష్టి పెట్టింది. పార్టీలో బలవంతంగా చేర్పుకుంటూ, అదంతా తమ బలమేనని చెప్పుకోవడానికి వ్యూహం రచించింది. ఇందులో భాగంగా అధిష్టానం ఆదేశాల మేరకు జిల్లాలోని ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగుతోంది. దీనిపై జిల్లావ్యాప్తంగా విస్తృత ప్రచారం చేపట్టారు. అధికారంలోకి వచ్చి ఆరునెలలవుతున్నా ఎటువంటి సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడంతో కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. దీంతో తెలుగుదేశం సభ్యత్వ నమోదుకు ఆశించిన మేర స్పందన కనిపించడం లేదు. చేసేది లేక ఆ పార్టీ నేతలు అధికారం అండతో అడ్డదారులను ఎంచుకున్నారు.

మహిళలే టార్గెట్...

సభ్యత్వ నమోదులో చతికిలపడిన తెలుగు తమ్ముళ్లు స్వయం సహాయక సంఘాల మహిళలను లక్ష్యంగా చేసుకున్నారు. భవిష్యత్తులో సంక్షేమ పథకాలు అందాలన్నా, రుణాలు రావాలన్నా టీడీపీ సభ్యత్వం తప్పనిసరిగా తీసుకోవాల్సిందేనని వారిపై ఒత్తిళ్లు తెస్తున్నారు. ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ పుస్తకం, సెల్‌ఫోన్ తీసుకుని తప్పనిసరిగా రావాలని స్వయం సహాయక సంఘాల మహిళలకు ఫోన్లు చేసి మరీ హుకుం జారీ చేస్తున్నారు. డ్వాక్రా సంఘాల గ్రూపుల్లో సైతం ఈ తరహా మెసేజ్‌లు పంపుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఆ శాఖకు చెందిన కొందరు అధికారులే డ్వాక్రా మహిళలకు నేరుగా ఫోన్లు చేసి మరీ టీడీపీ సభ్యత్వం తీసుకోవాలని సూచనలిస్తున్నట్లు సమాచారం. దీనిని బట్టి చూస్తే సభ్యత్వ నమోదుపై ఒత్తిళ్లు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. మరికొన్ని ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘం అధ్యక్షురాళ్లను రంగంలోకి దింపుతున్నారు. ఆమె తన గ్రూపులోని సభ్యులకు ఫోన్లు చేసి తెలుగుదేశం సభ్యత్వాలు తీసుకునేలా సూచనలిస్తున్నారు. లేకపోతే భవిష్యత్తులో ఎటువంటి పథకాలూ వర్తించవని బెదిరిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రమాద బీమా, సీఎం రిలీఫ్ ఫండ్ వంటివి పొందాలంటే టీడీపీ సభ్యత్వం తప్పనిసరని ఒత్తిడి చేస్తున్నారు. దీంతో చేసేది లేక మహిళా సమాఖ్య అధ్యక్షురాలు చెప్పినట్లు సభ్యులు సంతకాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. సభ్యత్వ నమోదు పేరుతో ఆయా మహిళల ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా పుస్తకం జిరాక్స్‌లు తీసుకుంటున్నారు. నమోదు చేసిన వెంటనే ఆయా మహిళల మొబైల్ నంబర్లకు ఓటీపీ వస్తోంది. ఆ ఓటీపీతో లాగిన్ అయ్యి టీడీపీ సభ్యత్వం ధ్రువీకరిస్తున్నారు. ఈ తంతు జిల్లాలో వేగంగా సాగుతోంది. ఈ విధానం ద్వారా లక్షల్లో సభ్యత్వాలు పెంచుకునేందుకు టీడీపీ నేతలు వ్యూహం రచిస్తున్నారు. ఇలా అడ్డగోలుగా సభ్యత్వాలు చేయించి, దీనిని చూపి, వారందరూ టీడీపీ విధానాలకు ఆకర్షితులై తమ పార్టీలో చేరారని తప్పుడు ప్రచారం చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు.

మొక్కుబడి తంతు

ఇప్పటికే ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయక పోవడంతో కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర స్థాయిలో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ తరుణంలో గ్రామాల్లోకి వెళ్తే తమను నిలదీస్తారనే ఉద్దేశంతో టీడీపీకి చెందిన ఎమ్మెల్యేలు, నియోజకవర్గ స్థాయి నేతల వరకూ సభ్యత్వ నమోదుపై ముందడుగు వేయడానికి సంకోచిస్తున్నారు. మొక్కుబడిగా ఈ కార్యక్రమం కొనసాగిస్తున్నారు. అయితే, పార్టీ సభ్యత్వ నమోదులో వెనుకబడితే తామెక్కడ చీవాట్లు తినాల్సి వస్తుందోనన్న తలంపుతో నేతలు అడ్డదారిని ఎంచుకున్నారు. ఎక్కువ సభ్యత్వాలు కావాలంటే స్వయం సహాయక సంఘాల సభ్యులను చేర్చడమే ఉత్తమమని ఆ పార్టీ నాయకులు భావించి ఇలా చేస్తున్నారనే చర్చ జోరుగా సాగుతోంది.

క్లుప్తంగా

డ్రంకన్‌డ్రైవ్‌లో జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): మద్యం తాగి వాహనం నడుపుతున్న వారికి సోమవారం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డిగారి రాంభూపాల్ జైలు శిక్షను ఖరారు చేసినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. బండిఆత్మకూరు మండలం లింగాపురం గ్రామానికి చెందిన రంగస్వామి, నంద్యాలకు చెందిన కందమూరి శివకుమార్ మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడటంతో పోలీసులు అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా ఒక్కొక్కరికి రెండు రోజుల పాటు జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థి ఆత్మహత్య


మృతి చెందిన సిద్దిబాషా


కొలిమిగుండ్ల: మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లెలో సోమవారం ఓ విద్యార్థి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు. అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన దూదేకుల సిద్దిబాషా(13)కు చిన్నప్పుడే తల్లితండ్రులు చనిపోవడంతో అంకిరెడ్డిపల్లెలో ఉంటున్న పెద్దమ్మ షెకూరిబీనే తాడిపత్రిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదివిస్తోంది. హెయిర్‌స్టైల్ సరిగా లేదని స్కూల్ యాజమాన్యం ఫిర్యాదు చేయడంతో గ్రామంలోనే సెలూన్ షాపులో ఉదయం కటింగ్ చేయించుకుని ఇంటికి వెళ్లాడు. అయినా కటింగ్ సరిగా లేదని, సరిగా చేయించుకోవాలని పెద్దమ్మ మందలించడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకున్నాడు. కొద్ది సేపటికి గమనించి ఉరి నుంచి తప్పించి చికిత్స కోసం తాడిపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

‘స్మార్ట్’గా విద్యుత్ ఉచ్చు

- ప్రభుత్వ, వాణిజ్య సర్వీసులకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు
- గుట్టుగా బిగిస్తున్న అధికారులు
- ముందస్తు రీచార్జ్ చేసుకోకుంటే పవర్ కట్..


కలెక్టరేట్‌లోని ప్రభుత్వ కార్యాలయంలో బిగించిన స్మార్ట్ మీటర్

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను చంద్రబాబునాయుడు తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రస్తుతం దానికి భిన్నమైన వైఖరిని తీసుకున్నారు. ప్రజానీకం వ్యతిరేకిస్తున్నప్పటికీ ఇళ్లకు స్మార్ట్ మీటర్లను బిగించే ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చేపడుతోంది. డిసెంబర్ నుంచే ఈ మీటర్లను ఇళ్లకు బిగించడానికి సన్నాహాలు పెద్ద ఎత్తున సాగుతున్నాయి. రాష్ట్రంలోని వివిధ డిస్కమ్‌లకు ఇప్పటికే అదాని స్మార్ట్ మీటర్లు చేరాయి. స్మార్ట్ మీటర్లు బిగించేందుకు ఏడాది కాంట్రాక్టు పేరుతో ప్రైవేటు కన్సల్టెన్సీ సంస్థ నియామక ప్రక్రియ చేపట్టింది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య సర్వీలకు సంబంధించిన 10 వేల సర్వీసులకు స్మార్ట్ మీటర్లు బిగించినట్లు విద్యుత్ అధికారులు చెబుతున్నారు.



విద్యుత్ సబ్ స్టేషన్

కర్నూలు న్యూసిటీ: రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటి నుంచో చెబుతున్న స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ జిల్లాలో గుట్టు చప్పుడు కాకుండా మొదలైంది. వీటిని తొలి దశలో ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య సర్వీసుల మీటర్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా మొత్తం 7,732 ప్రభుత్వ కార్యాలయాల సర్వీసులు ఉండగా .. ఇప్పటి వరకు 3,000 కార్యాలయాల సర్వీసులకు స్మార్ట్ మీటర్లను అమర్చారు. ఆ తరువాత వాణిజ్య, గృహ వినియోగదారుల సర్వీసులకు అమర్చుతామని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. గృహ వినియోగదారుల్లో 800 యూనిట్ల పైబడిన వారికి మాత్రమే తొలుత అమర్చుతారు. ఈ మీటర్ల ఏర్పాటు వల్ల ముందుగా రీచార్జ్ చేసుకుంటేనే విద్యుత్ ఉంటుంది. లేదంటే కట్ చేస్తారు. దీంతో వినియోగదారుల జేబులు గుల్ల కానున్నాయి. పేద, ధనిక వ్యాపారులు అనే తేడా లేకుండా అందరిపైనా స్మార్ట్ మీటర్ల పేరుతో విద్యుత్ భారాలు పడనున్నాయి. జిల్లాలో వాణిజ్య వినియోగదారుల(కమర్షియల్) సర్వీసులు 78 వేలు, గృహ వినియోగదారులు(డొమెస్టిక్) 6.5 లక్షల మంది ఉన్నారు. 1.10 లక్షల వ్యవసాయ సర్వీసులు, 3,100 పరిశ్రమల సర్వీసులు, 426 హెచ్‌టీ కనెక్షన్లు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు స్మార్ట్ మీటర్లు అమర్చుతున్నారు. వీటిని ఏర్పాటు చేసే కాంట్రాక్టును కేంద్రం అదాని సంస్థకు కట్టబెట్టింది. ప్రస్తుతం వాటిని ఉచితంగా బిగిస్తున్నప్పటికీ భవిష్యత్‌లో ఒక్కో స్మార్ట్ మీటరుకు రూ.12 వేలు చెల్లించాల్సి ఉంటుందని అంటున్నారు. జిల్లాలో మొదటి విడతగా ప్రభుత్వ కార్యాలయాలు, ఇండస్ట్రీల సర్వీసులు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారు. వీటి ఏర్పాటు పూర్తయ్యాక రెండో విడతగా వ్యాపార సముదాయాలకు, పరిశ్రమలకు, వ్యవసాయ బోర్లకు బిగించే ప్రక్రియను చేపడతారు. ఆతరువాత మూడో విడతగా గృహాలకు స్మార్ట్ మీటర్లు పెట్టనున్నారు.

ముందస్తు రీచార్జ్ లేకుంటే విద్యుత్ కట్

స్మార్ట్ మీటర్లు వినియోగంలోకి వస్తే నిత్యం వాడే సెల్‌ఫోన్ లాగే స్మార్ట్ మీటర్లకు ముందుగానే రీచార్జ్ చేయాల్సి ఉంటుంది. రీచార్జ్ చేసుకోకపోయినా, మర్చిపోయినా కరెంట్ దానికదే కట్ అయిపోయి ఇళ్లు అంధకారంగా మారుతుంది. మళ్లీ రీచార్జ్ చేయాలంటే ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవాలి. ఈ తతంగాన్ని గ్రామీణ ప్రాంతాల్లో చేసుకోలేరనే వాదనలు వినిపిస్తున్నాయి. దీనివల్ల విద్యుత్ శాఖకు లాభం ఉండవచ్చు కానీ సాధారణ ప్రజలకు ఇబ్బందులు తప్పవనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం నెలకు ఒక్కసారి విద్యుత్ బిల్లులు కడుతున్నాం. స్మార్ట్ మీటర్లు ఇళ్లకు వస్తే రీచార్జ్ ఎప్పుడు అయిపోతే అప్పుడు వినియోగదారులు కట్టుకోవాల్సిందే. స్మార్ట్ మీటర్లు రావటం ద్వారా తొలుత ఇంటింటికీ తిరిగి బిల్లులు తీసే మీటరు రీడర్లను తొలగించే ప్రమాదం ఉంది.

కేంద్రం నిర్ణయానికి తలొగ్గిన రాష్ట్రం

కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేయాలన్న నిర్ణయానికి రాష్ట్ర ప్రభుత్వం తలూపింది. వీటి వల్ల ఎక్కడ ఎంత విద్యుత్ వినియోగిస్తున్నదీ ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు తెలుస్తుందని, ఓల్టేజీ హెచ్చు తగ్గులు, ట్రాన్స్‌ఫార్మర్లపై పడుతున్న లోడ్ వంటి అంశాలు తెలుస్తాయని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే మొబైల్స్ మాదిరిగా డబ్బు కట్టి రీచార్జ్ చేసుకోవలసి ఉంటుంది. ప్రస్తుతం విద్యుత్ వినియోగించిన తరువాత ప్రతి నెల 10 నుంచి 15 రోజుల వ్యవధిలో బిల్లులు కట్టించుకుంటున్నారు. స్మార్ట్ మీటర్లు వచ్చాక అదికుదరదు. నెలకు ఎంత విద్యుత్ బిల్లు వస్తుందో సగటున అంచనా వేసి మొత్తాన్ని ముందుగానే చెల్లించి మీటరును రీచార్జ్ చేసుకోవలసి ఉంటుంది. ఒకసారి అధికంగా విద్యుత్‌ను వినియోగిస్తే మొత్తం ముందుగానే రీచార్జ్ డబ్బులు అయిపోతాయి. అటువంటి సమయంలో వినియోగదారుల మొబైల్‌కు మేసేజ్ పంపిస్తారు. దాని ప్రకారం రీచార్జ్ చేసుకోవాల్సి ఉంటుందని విద్యుత్ అధికారులు చెబుతున్నారు.

జూలై 25 నాటికి పూర్తి చేయాలి



వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తును అందించేందుకు పాత విద్యుత్తు రీడింగ్ మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లను అమర్చుతున్నాం. ఇవి వినియోగదారుల విద్యుత్తు సమస్యలు వెంటనే పసిగట్టి పరిష్కరించేందుకు ఏంతో దోహదపడతాయి. విద్యుత్ బిల్లు చెల్లింపులకు పారదర్శకత పాటించేందుకు ఉపయోగపడతాయి. అన్ని రకాల సర్వీసులకు వచ్చే ఏడాది జులై 25 నాటికి స్మార్ట్ మీటర్లు బిగించాలని ప్రభుత్వ ఆదేశించింది.

– రాజేష్, డిప్యూటీ ఈఈ కన్‌స్ట్రక్షన్స్

భోగేశ్వరుడికి కిరణాభిషేకం


శివలింగాన్ని తాకిన సూర్య కిరణాలు

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల సమీపంలోని దక్షిణకాశీగా పేరుగాంచిన దుర్గాభోగేశ్వర ఆలయంలో భోగేశ్వరుడికి కిరణాభిషేకం జరిగింది. కార్తీక చివరి సోమవారం కావడంతో ఉదయం 6.55 నుంచి 7.05 గంటల వరకు ఆదిదేవునిపై సూర్యకిరణాల ప్రసరణ భక్తులను కనువిందు చేసింది. ఏటా నవంబర్ నెలలో సూర్యకిరణాలు శివలింగాపై పడతాయని ఆలయ ప్రధానార్చకులు శ్యాంసుందర్‌శర్మ తెలిపారు. మరో రెండు రోజుల పాటు భోగేశ్వరుడిపై సూర్య కిరణాలు పడతాయన్నారు. ఈ అద్భుతాన్ని చూసి, స్వామివారిని దర్శించుకునేందుకు ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు.

మల్లన్న సేవలో సినీ డైరెక్టర్ బోయపాటి శ్రీను



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను ప్రముఖ సినీ డైరెక్టర్ బోయపాటి శ్రీను దర్శించుకున్నారు. సోమవారం మల్లన్న దర్శనార్థం శ్రీశైలం చేరుకున్నారు. అనంతరం మల్లికార్జున స్వామివారిని, భ్రమరాంబాదేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అభిమానులు ఆయనతో సెల్ఫీలు, ఫొటోలు దిగేందుకు ఆసక్తి చూపారు.

గంజాయి సాగు కలకలం


గంజాయి మొక్కల్ని దగ్ధం దృశ్యం

కౌతాళం: మండల పరిధిలోని రౌడూరు గ్రామ పొలాల్లో గంజాయి సాగు కలకలం రేపింది. కర్ణాటక సరిహద్దులో గంజాయి సాగు చేసినట్లు తెలుసుకున్న పోలీసులు ఆదివారం రాత్రి అక్కడికి పరుగులు తీశారు. 183 గంజాయి మొక్కలు గుర్తించి పీకేశారు. వాటి విలువ ఎంతనేది పోలీసులు వెల్లడించలేదు. గంజాయి మొక్కల సమాచారాన్ని బయటకు పొక్కనీయకుండా సోమవారం గోప్యంగా దగ్ధం చేశారు. ఇదే విషయమై సీఐ అశోక్‌కుమార్ మాట్లాడుతూ గంజాయి సాగైన విషయం తెలుసుకుని సిబ్బందితో పాటు రెవెన్యూ, వ్యవసాయ, ఎక్సైజ్‌శాఖల సమక్షంలో 183 మొక్కల్ని స్వాధీనం చేసుకుని 182 మొక్కల్ని దగ్ధం చేశామన్నారు. ఒక మొక్కను శాంపిల్‌కు పంపామన్నారు. సాగు చేసినట్లు అనుమానిస్తున్న రౌడూరు గ్రామానికి చెందిన బోయ గిడ్డయ్య, రఘువర్ధన్‌రెడ్డి, మాలవీరేష్‌లను అరెస్టు చేసి రిమాండుకు తరలించామన్నారు.

దంత వైద్యుల సంఘం కార్యవర్గం ఎన్నిక


డాక్టర్ కిశోర్‌కుమార్‌ను అభినందిస్తున్న దంత వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): ఇండియన్ డెంటల్ అసోసియేషన్(దంత వైద్యుల సంఘం) ఉమ్మడి కర్నూలు జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికైంది. కర్నూలు, నంద్యాల జిల్లాల దంత వైద్యుల వార్షిక సమావేశం సోమవారం కర్నూలులో నిర్వహించారు. ఇందులో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా నంద్యాలకు చెందిన డాక్టర్ కె.కిశోర్‌కుమార్, ఉపాధ్యక్షులుగా డాక్టర్ పరమేశ్వరరెడ్డి, డాక్టర్ దత్త సాయి కిరణ్, డాక్టర్ సతీష్, ట్రెజరర్‌గా డాక్టర్ సందీప్‌కుమార్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సెక్రటరీ డాక్టర్ రాయపు రామచంద్రారెడ్డి, మాజీ అధ్యక్షులు డాక్టర్ ఉపేంద్రనాథ్‌రెడ్డి, డాక్టర్ అమరసింహారెడ్డి, డాక్టర్ నాగలక్ష్మిరెడ్డి, డాక్టర్ నరేష్‌గౌడ్, డాక్టర్ నౌషాద్, డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, డాక్టర్ పవన్‌సాయి, డాక్టర్ అశోక్, డాక్టర్ యశ్వంత్ పాల్గొన్నారు.

విద్యార్థులు మత్తుకు దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలోని వైద్య విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, బాగా చదువుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ సూచించారు. సోమవారం కర్నూలు మెడికల్ కాలేజీ మెన్స్ హాస్టల్‌లో మత్తు పదార్థాలపై వైద్య విద్యార్థులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ మాట్లాడుతూ.. మత్తు పదార్థా ల వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మత్తు పదార్థాల వినియోగం వల్ల ఆరోగ్యం పూర్తిగాచెడిపోవడమే గాక బంధువులకు, కుటుంబ సభ్యులకు దూరమవుతారని చెప్పారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రేణుకాదేవి, డాక్టర్ సాయిసుధీర్, డాక్టర్ విజయ్ ఆనందబాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి క్రీడలు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక పద్మావతినగర్‌లోని ఇండోర్ స్టేడియంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్‌–19 బాలబాలికల రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ క్రీడలు ప్రారంభించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 13 జిల్లాల నుంచి 300 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు. క్రీడాకారులకు మున్సిపల్ పాఠశాలలో వసతి ఏర్పాటు చేర్పాటు చేశామన్నారు.

బ్రిడ్జి పైనుంచి దూకి ఆత్మహత్య

కర్నూలు: స్థానిక సిల్వర్‌జూబ్లీ కాలేజీ సమీపంలోని ఖానా ఖజానా బ్రిడ్జి పైనుంచి మతిస్థిమితం లేని వ్యక్తి కిందకు దూకి మృతిచెందాడు. ఇతను స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద భిక్షాటన చేస్తూ జీవనం సాగించేవాడు. సోమవారం సాయంత్రం రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తూ ఖానా ఖజానా వద్ద బ్రిడ్జి పైనుంచి దూకడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు మూడో పట్టణ పోలీసులు అక్కడికి చేరుకుని ఘటనకు దారి తీసిన కారణాలపై ఆరా తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించారు. మృతుడి వివరాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక కేదారగౌరీ వ్రతాలు


కేదారగౌరీ వ్రతం పూజలు నిర్వహిస్తున్న అర్చకులు


పాల్గొన్న భక్తులు

శ్రీశైలంటెంపుల్: కార్తీక మాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకుని శ్రీశైల దేవస్థానం ఉచిత కేదారగౌరీ వ్రతాలను నిర్వహించింది. సోమవారం ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో ఉదయం 7.30 గంటలకు, 9.30 గంటలకు రెండు విడతలుగా కేదారగౌరీ వ్రతాన్ని నిర్వహించారు. 376 మంది చెంచు భక్తులు, 960 మంది ఇతర భక్తులు ఈ వ్రతాన్ని జరిపించుకున్నారు. వ్రతానికి కావాల్సిన పూజా ద్రవ్యాలన్నింటినీ దేవస్థానమే సమకూర్చింది. ముందుగా మహాగణపతిపూజ జరిపి వేదికపై ఆశీనులైన స్వామిఅమ్మవార్లకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజ జరిపించారు. అనంతరం భక్తులందరిచే విడివిడిగా కలశస్థాపన చేయించి వ్రతకల్పపూర్వకంగా పూజాదికాలు జరిపారు. ఆలయ అర్చకులు వ్రతకథను పఠించి వ్రత మహిమా విశేషాలను తెలియజేశారు. చివరగా నీరాజన మంత్ర పుష్పాలను జరిపి వ్రతసమాప్తి చేశారు. ప్రసాదాలు, పూలు, గాజులు, రవిక వస్త్రం, కంకణాలు, దేవస్థానం ప్రచురించిన అష్టోత్తర శతనామ కదంబ పుస్తకం, ఉసిరి, బిల్వ మొక్కలను అందజేశారు. వ్రతకర్తలకు స్వామిఅమ్మవార్ల దర్శనం, అన్నప్రసాద సదుపాయాన్ని కల్పించారు.

తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణకు ఎంసీపీ కార్డు

కర్నూలు(హాస్పిటల్): తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణ కోసం నూతన ఎంసీపీ కార్డు రూపొందించారని డెమో శ్రీనివాసులు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఫర్హీన్ తబస్సుమ్ చెప్పారు. సోమవారం నగరంలోని శరీన్ నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు ఎంసీపీ కార్డుపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చిన్నారులకు సకాలంలో వేయించాల్సిన టీకాలతో కూడిన విలువైన సమాచారంతో ఎంసీపీ కార్డు ఉంటుందన్నారు. కార్డులోని సమాచారం ఆధారంగా గర్భిణికి నవమాసాలు పూర్తయి బిడ్డ ప్రసవించే నాటికి పూర్తి ఆరోగ్యంగా ఉండేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అలాగే ప్రస్తుతం చలి తీవ్రత ఎక్కువగా ఉంటోందని, చిన్న పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో బాధపడేవారు అప్రమత్తంగా ఉండాలన్నారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్య విద్యాబోధకులు పద్మావతి, ఆరోగ్య కార్యకర్తలు కళ్యాణి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా రాతిదూలం పోటీలు


రాతిదూలం లాగుతున్న ఎద్దులు

సంజామల: మండల పరిధిలోని నయనాలప్ప క్షేత్రంలో కార్తీక కడ సోమవారాన్ని పురస్కరించుకుని వృషభాల రాతిదూలం లాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. న్యూకేటగిరీ విభాగంలో మొదటి బహుమతి బేతంచర్ల మండలం గోర్లగుట్టకు చెందిన ఇంద్రసేనారెడ్డి, కర్నూలుకు చెందిన ఖలీల్‌షాష వృషభాలు, రెండవ బహుమతి కర్నూలుకు చెందిన గోపాల్ గౌడ్, మూడవ బహుమతి కర్నూలు మండలం రుద్రవరం గ్రామానికి చెందిన ఎల్లాగౌడ్, నాలుగవ బహుమతి వైఎస్సార్ జిల్లా దువ్వూరుకు చెందిన వారధి వృషభాలు గెలుచుకున్నాయి. గెలుపొందిన వృషభాల యజమానులకు నిర్వాహకులు వరుసగా రూ.60 వేలు, రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం


శ్రీలక్ష్మమ్మ(ఫైల్)


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

రుద్రవరం: మండల పరిధిలోని నర్సాపురం సమీపంలో చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందగా మరొకరు గాయాలపాలయ్యారు. ఏఎస్ఐ భూపాల్‌రెడ్డి తెలిపిన వివరాలు.. దిగువ అహోబిలం బ్రాహ్మణ అన్న సత్రంలో రామంజనేయులు అనే వ్యక్తి తన కుటుంబ సభ్యులతో కలిసి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. సోమవారం కార్తీక మాసం చివరి వారం కావడంతో భార్య శ్రీలక్ష్మమ్మ(36), కోడలు ఏసమ్మతో కలిసి మోటార్ సైకిల్‌పై ఓంకారం క్షేత్రానికి బయలుదేరాడు. అహోబిలం–నర్సాపురం రోడ్డులోని రవీ డిగ్రీ కళాశాల వద్దకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్‌ను తప్పించేక్రమంలో మరో వైపునకు తిప్పాడు. అక్కడ కారు వెళ్తుండటం.. రోడ్డుపై వరి ధాన్యం ఆరబోసి ఉండటంతో శ్రీలక్ష్మమ్మ మోటార్ సైకిల్ మీద నుంచి కిందకు దూకింది. ప్రమాదంలో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందింది. మోటార్ సైకిల్‌పై వెనుక కూర్చున్న కోడలు ఏసమ్మ కింద పడటంతో స్వల్ప గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

ఇద్దరు మట్కాబీటర్ల అరెస్ట్

- రూ.2.15 లక్షల నగదు, సెల్‌ఫోన్, 10 లీటర్ల నాటుసారా స్వాధీనం


మట్కా బీటర్ల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సోమన్న

ఆదోని అర్బన్: ఇద్దరు మట్కా బీటర్లను పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.2.15 లక్షల నగదు, 10 లీటర్ల నాటు సారా, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుల వివరాలను స్థానిక త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ రామలింగమయ్యతో కలిసి డీఎస్పీ సోమన్న విలేకరులకు వెల్లడించారు. ఈనెల 1న పట్టణానికి చెందిన ఇద్దరు మట్కా బీటర్లు అలీహుసేన్, ఈరప్పలను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.35 వేల నగదు, 15 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. వారిచ్చిన సమాచారంతో ఇదే కేసులోని మరో ఇద్దరు మట్కా బీటర్లు ఆలూరు మండలం కమ్మరచేడు గ్రామానికి చెందిన శ్రీకాంత్‌రెడ్డి, ఆదోనికి చెందిన చాంద్‌బాషాపై నిఘా ఉంచారు. ఈక్రమంలో ఆస్పరి బైపాస్ రోడ్డులో ఉండగా అరెస్టు చేసి, వారి నుంచి రూ.2,15,600 నగదు, సెల్‌ఫోన్, పది లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దరినీ రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలియజేశారు.

ధోబీఘాట్ల నిర్మాణానికి చర్యలు

- రజక కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ సావిత్రమ్మ


ధోబీఘాట్‌ను పరిశీలిస్తున్న ఛైర్‌పర్సన్ సావిత్రమ్మ

కర్నూలు(అర్బన్)/సెంట్రల్: రజక వృత్తిపై ఆధారపడిన 60 రజక కుటుంబాలకు ఒక ధోబీఘాట్ చొప్పున నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రజక వృత్తిదారుల వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ సావిత్రమ్మ తెలిపారు. సోమవారం స్థానిక ప్రభుత్వ అతిథి గృహానికి వచ్చిన ఆమెకు రజక సంఘాల నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రజకుల అభివృద్ధి కోసం తమ వంతు కృషి చేస్తామన్నారు. అనంతరం నగరంలోని పలు ధోబీ ఘాట్లను పరిశీలించారు. ఛైర్‌పర్సన్ సావిత్రమ్మను కలిసిన వారిలో రజక, ప్రజా సంఘాల నాయకులు సి.గురుశేఖర్, శ్రీరాములు, నాగరాజు, రాంబాబు, మధు, శ్రీను, లక్ష్మన్న, మురళీనాయుడు, లోకేశ్వరయ్య, కోటి యాదవ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కుమారులు పట్టించుకోవడం లేదు

- ఎస్పీకి ఫిర్యాదు చేసిన తల్లి
- ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 107 ఫిర్యాదులు


వృద్ధురాలి సమస్య తెలుసుకుంటున్న జిల్లా ఎస్పీ బిందు మాధవ్

కర్నూలు: ‘నాకు ముగ్గురు కుమారులు ఉన్నారు.. బాగా చూసుకుంటామని నా దగ్గర ఉన్న డబ్బు తీసుకున్నారు. దర్గాకు వెళ్దామని తీసుకెళ్లి గుట్టపాడు గ్రామంలో ఉన్న బంధువుల ఇంటి వద్ద వదిలిపెట్టి వెళ్లిపోయారు. మీరే నాకు న్యాయం చేయండి సారూ’ అంటూ ఓర్వకల్లు గ్రామానికి చెందిన బాహర్‌బీ ఎస్పీ బిందు మాధవ్ వద్ద గోడు వెళ్లబోసుకుంది. కర్నూలు టూటౌన్ పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న క్యాంపు కార్యాలయంలో ఎస్పీ బిందు మాధవ్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించి నేరుగా వారితో మాట్లాడారు. మొత్తం 107 ఫిర్యాదులు అందాయని, వాటన్నిటిపై చట్టపరిధిలో విచారణ జరిపి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు.

వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని..

- తనకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారని, తనతో పాటు వారిని కలుపుకుని ఆస్తిలో నాలుగు వాటాలుగా చేసుకుని పెద్దల సమక్షంలో పంపకాలు చేసుకున్నామని, అయితే కుమార్తెలు గోపిలక్ష్మి, భూలక్ష్మి వారి మేనమామ రాముడు కలిసి తనకు ఇంటిలో వాటా లేదని, బయటకు వెళ్లిపోవాలని ఇబ్బందులకు గురిచేస్తున్నారని కర్నూలు సోమిశెట్టి నగర్‌కు చెందిన చిన్నమ్మ ఫిర్యాదు చేశారు.
- తన ఇద్దరు కుమారులు మద్యానికి అలవాటు పడి అల్లరి పనులు చేస్తూ, తాను వ్యవసాయం చేస్తూ కష్టపడి సంపాదించినదంతా అయిపోగొడుతున్నారని, కౌన్సిలింగ్ ఇచ్చి తన సంసారాన్ని చక్కదిద్దాలని ఎమ్మిగనూరు మండలం రాళ్లదొడ్డి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారు.
- ఎమ్మిగనూరు నుంచి మంత్రాలయం వెళ్లే రోడ్డులో మూడున్నర ఎకరాల పొలానికి ఆంజనేయులుతోపాటు మరికొందరు రూ.20 లక్షలు తీసుకుని, పొలం పాసు పుస్తకాలు ఇవ్వకుండా రిజిస్ట్రేషన్ చేయకుండా వేరొకరికి విక్రయించి మోసం చేశారని కర్నూలు చిత్తారి వీధికి చెందిన విజయకుమార్ ఫిర్యాదు చేశారు.
- భర్త ఇమ్మానుయేలు ముంబయిలో పని చేస్తున్నాడని, ఆస్తి కోసం ఆశపడి తనను పెళ్లి చేసుకుని రెండు నెలలు మాత్రమే కాపురం చేసి ఆస్తి తన పేరు మీద వచ్చిన తర్వాత ముంబయి నుంచి వెనక్కు పంపించి మోసం చేశాడని ఆదోని మండిమెట్టకు చెందిన రూప ఫిర్యాదు చేశారు.
- కర్నూలు, నంద్యాల జాతీయ రహదారి పక్కనున్న నన్నూరు గ్రామ పంచాయతీ పరిధిలో స్నేహ గ్రీన్ సిటీలో రెండు ప్లాట్లను రూ.14 లక్షలకు కొనుగోలు చేశానని, మూడు నెలల క్రితం ప్లాట్ నెంబర్ రాళ్లను తొలగించి స్నేహ గ్రీన్ సిటీ నిర్వాహకుడు సిద్ధయ్య వేరేవారికి విక్రయించి మోసం చేశాడని అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు చేశారు.
- కర్నూలుకు చెందిన నాగిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి మధ్యవర్తులుగా ఉంటూ పొలాన్ని తనకు రూ.58.55 లక్షలకు ఇప్పిస్తామని చెప్పి డబుల్ రిజిస్ట్రేషన్ చేయించి మోసం చేశారని, తిరిగి డబ్బు ఇవ్వడం లేదని కర్నూలు వాసు నగర్‌కు చెందిన విజయలక్ష్మి ఫిర్యాదు చేశారు.